# కనువిప్పు

రచన:
శ్రీ బి. వి. రవికృష్ణ.

గబ గబా బస్సెక్కింది 'పత్రిక'. చేతిలో బ్రీఫ్ కేస్, ఓ చేతిలో ఓ వార పత్రిక. బస్సులో సీట్లన్నీ ఫిలప్ అయ్యాయి. నిల్చోడానికి మాత్రం బస్సు ఖాళీగా ఉంది. సీట్ల వైపు ఆతృతగా చూసింది సీట్లుకోసం పత్రిక. ఇంచు మించు అంతా మగాళ్ళే. ఓ చివర మాత్రం ముగ్గురు ఆడాళ్ళు ఒకే సీటుపై ఎడ్జస్టు అయ్యారు. ముందు సీట్లో మాత్రం ఒకతడే కూర్చున్నాడు. తనకు సీటు ఇక దొరకదని ముందునే నిల్చుంది. అతడు న్యూస్ పేపర్ చదువుతూ ఉన్నాడు.

"ఏమండీ " అన్నాడు అతడు పత్రిక వైపు చూస్తూ.

'ఏం?' అన్నట్లు చూసింది.

"నా ప్రక్కన సీటు ఖాళీగా ఉంది. మీకు అభ్యంతరం లేకపోతే కూర్చోండి." అన్నాడు కొంచం తడబడుతూ. అతడి పేరు మదన్.

పత్రిక తుళ్ళుమంది. కోపంతో "షటాప్...." అంది. ఈ మగాళ్ళే అంతే....అదును దొరికితే ఎత్తుకు పోతారు. ఎంత పొగరు! తన ప్రక్కనే కూర్చోమంటాడా? చూస్తే చదువుకున్న వాడిలా ఉన్నాడు. సంస్కారం తెలీకుండా మాట్లాడుతున్నాడు.

అంతలో కండక్టర్ వచ్చి "టిక్కెట్!" అన్నాడు.

పత్రిక హేండ్ బాగ్ నుండి ఇరవై నోటు తీసి "విజయవాడ!" అంది.

టిక్కెట్ యిచ్చి, మిగిలిన చిల్లరిచ్చాడు కండక్టర్. మదన్ కూడా తగినంత చిల్లర యిచ్చి, "విజయవాడ!" అన్నాడు.

"అది కాదండి ..." అని ఏదో మాట్లాడుతుండగా "పళ్ళెత్తి మాట్లాడవంటే పళ్ళు రాల్తాయి!" అంది.

"చూడండి. మిమ్మల్ని అల్లరి చేయటం కోసం కాదు. మీ కోసమే చెబుతున్నాను. ఎంత సేపని నిల్చుంటారు. విజయవాడంటే లాంగ్ జర్నీ...." అని అంటూ ఉండగానే మూతి ముడుచుకొని కోపంగా దూరంగా వెళ్ళి నిలుచుంది.

'నాకేం లే!' అని అనుకొని ప్రక్కకి ఒరిగి కిటికీవైపు చూస్తూ ఉన్నాడు. బస్సు జోరుగా పోతుంది.

పచ్చని చెట్లు, పంట పొలాలు అందుకున్న ప్రకృతిని చూస్తూ ఉన్నాడు మదన్.

ఇలాంటి మగాళ్ళకు చెప్పిచ్చి కొట్టాలి. మర్యాదా - మంచీ తెలీదు. ఒంటరిగా ఆడది దొరికితే చాలు - తమ సొంతమైనట్లు అయిపోతారు. 'నాన్సెన్స్' అనుకుంది. అతడి దృష్టంతా ఆ ప్రకృతి వైపే ఇటు చూడట్లేదు.

బస్సు ప్రక్క స్టేషన్‌లో ఆగింది. ఈ బస్సు కోసం చాలా మంది వైట్ చేస్తున్నారు. ఒకరికి ఒకరు తోసుకుంటూ బస్సు ఎక్కారు. అందులో ఉన్న వాళ్ళలో స్టూడెంట్సు ఎక్కువ మంది. ఆతృతగా ఒకరికి ఒకరు గుద్దుకుంటూ సీట్లుకోసం చూసుకున్నారు. మదన్ ప్రక్కన ఒకాయన చటుక్కున కూర్చున్నాడు. 'హమ్మయ్య - సీటు దొరికింది' అనుకున్నాడు ఏదో ఎమ్. ఎల్. ఎ. సీటు దొరికినట్లు. బస్సు క్రిక్కిరిసి నిండి పోయింది. పత్రిక చుట్టూ ఓ నలుగురు రోమియోస్ వచ్చి నిలుచున్నారు. ఆమెను చూసేసరికి నలుగురి మొఖాలు ఆనందంతో నిండుకున్నాయి.

"అందమైన పిల్లరా! పిటపిట లాడుతుంది." అన్నాడు ఒకడు.

"దేవలోకం నుంచి వచ్చిన కన్యలా ఉంది." అన్నాడు మరొకడు.

"ఏమండీ, మీ పేరు తెలుసుకోవచ్చా?" అన్నాడు నలుగురిలో ఒకడు పత్రికను ఉద్దేశిస్తూ.

"షటాప్...." అంది కోపంగా.

"పేరు చాలా గమ్మత్తుగా ఉంది కదరా?" అన్నాడు. అందరూ ఒక్కసారిగా నవ్వారు.

పత్రికకు వీళ్ళ కామెంట్స్‌కు ఒళ్ళు చిర్రెత్తుతోంది. కోపంతో పళ్ళు పటపట లాడింది. 'చాచి కొట్టాలనుకుంది. కాని తను ఒకర్తి!....వాళ్ళు....'

అంతలో తన మీద ఒకడు పడ్డాడు. అగ్గిలా కోపంగా చూసింది.

బుద్ధిమంతుడిలా "ఎవడ్రా తోసింది? ముందు ఆడవాళ్లున్నారని తెలియట్లేదా?" అన్నాడు అమాయకం నటిస్తూ. అందరూ పకపక నవ్వుకున్నారు.

నలుగురూ పత్రికను రాసుకొని నిల్చున్నారు. అప్పుడప్పుడు మీద పడుతున్నారు. తన కిది చాలా యిబ్బందిగా వుంది. పోనీ యింకో దగ్గరకు వెళ్ళి నిలుచుందామంటే బస్సంతా నిండి క్రిక్కిరిసి వుంది. ఓర్పుగా నిలుచుంది. బస్సు జోరుగా పోతుంది. కామెంట్సు మీద కామెంట్సు

మా ప్రత్యేక తయారింపులు : :

♦ 100% ఫైన్ ♦ పాయల్ ఫైన్
♦ జిప్పీ ఫైన్ ♦ మైసన్ ఫైన్
♦ రాకెట్ ఇంటర్ లాక్

Phone : 22016

R. K. S. Knittings

43, Cauvery St, TIRUPUR - 638 602.

Regd. No. 342215

చేస్తున్నారు వాళ్లు. కాలేజి వచ్చింది గాబోలు బస్సు ఆపారు. స్టూడెంట్స్ దిగటానికి రెడీగా ఉన్నారు.

"ఒరే ఇక్కడనుంచి కదల బుద్ధి కావట్లేదురా!...." అన్నారు పత్రిక వైపు చూస్తూ.

"చాల్లేరా! ఈ రోజు యిది; రేపు మరొకర్తి. దొరక్క పోదా;" అన్నాడు మరొకడు.

పత్రికకు ఒళ్ళు మండుతుంది. 'రేపు మరొకర్తి....' ఈ మాటలకు పత్రికకు కోపంతో కొట్టాలనిపించింది. తన జాతికి యింత నీచంగా మాట్లాడటం తను సహించిలేక పోయింది. ఆడది మగాడికి ఇంత లోకువై పోయిందా! అనుకుంది. పత్రికను ఒక్కొక్కళ్ళు రాసుకుంటూ నలుగురూ తిరిగి పోయారు.

బస్సు బయలుదేరింది. కొద్దిగా కాళీ అయింది. మదన్ వైపు చూసింది. అతడు న్యూస్ పేపరు చదువుతూ కనిపించాడు. తనవైపే చూడడం లేదు అతడు. తనను మర్చిపోయి వుంటాడు. మిమ్మల్ని అల్లరి చేయటం కోసం కాదు....' మదన్ అనే మాటలు గుర్తుకు వచ్చాయి.

మళ్ళీ బస్సు ఆగింది. కొంతమంది దిగారు. సీట్లలో మాత్రం కూర్చొని ఉన్నారు జనం. మదన్ ప్రక్క నిలుచున్న వ్యక్తి కూడా బస్సు దిగాడు. పత్రిక ఒక్కర్తె నిలుచుంది. బస్సు బయలుదేరింది. మదన్ కూర్చున్న సీటు మాత్రం కాళీగా వుండి.

తను నలుగురి విద్యార్థుల మధ్య గడిపిన సమయం తలచుకుంటే నరకంలో ఉన్నట్లు తోచింది. తనే గాని మదన్ ప్రక్క కూర్చుంటే ఆ నరకం వుండేది కాదు.

మదన్‌ను ఉద్దేశిస్తూ "ఏమండీ!" అంది.

"ఏం!" అన్నాడు మదన్.

"ఈ సీట్లో కూర్చుంటాను." అంది.

ఆశ్చర్యంగా చూశాడు.

"కూర్చోండి. నాకు అభ్యంతరం లేదు." అన్నాడు చిన్నగా నవ్వుతూ.

ప్రక్కకు జరిగి సీటు యిచ్చాడు. కూర్చొని 'థాంక్స్' చెప్పింది. తనకూ అతడికి మధ్య కొద్దిగా కాళీగా వుంది. కనీసం అంటుకునైనా లేదు. అది అతడు తీసుకున్న జాగ్రత్త. అతడు ప్రకృతివైపే చూస్తూ ఉన్నాడు. తనను అసలు పట్టించుకో లేదు.

తను పొరపడింది. అతడు తను అనుకున్నలాంటి వాడు కాదు. సభ్యత, సంస్కారం తెలిసిన వాడిలా వున్నాడు. అతడిప్రక్క కూర్చున్నంత మాత్రాన తప్పుగా భావించుకోవడం పొరపాటు. అతడు మర్యాదగానే అడిగాడు. కానీ తనే పొగరుగా సమాధానం యిచ్చి అతడ్ని అవమాన పరిచింది. తనకు కనువిప్పు కలిగింది.

"ఏమండీ!" అని పిలిచింది.

అతడు చూడగానే "ఇందాక మిమ్మల్ని తెలీక ఏవో తిట్టాను. పొరపడి అలా ప్రవర్తించాను. సారీ...." అంది పత్రిక.

"పరవాలేదు లేండి." అన్నాడు మదన్.

మదన్ పత్రికవైపు చూసి "మీకే 'థాంక్స్' చెప్పాలి" అన్నాడు.

"ఎందుకు?" అంది ఆశ్చర్యంగా.

"ఇప్పటికైనా నన్ను అర్థం చేసుకున్నందుకు." నవ్వుతూ అన్నాడు మదన్.

పత్రిక నవ్వుతూ తల దించుకుంది. 'అందరు మగవాళ్ళు రోమియోస్ అనుకోవడంలో తను పొరపడింది. అందరూ మదన్ లాంటి మగవాళ్ళుంటే....?' అనుకుంది పత్రిక.

Edited and Published by A. N. Raghavachar, No. 10, Murugesa Mudali St Madras-600 079.
Printed by G. Kulasekaram at Giridhar Art Printers, 47, Badrian Street, Madras-600 001.